క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన డీఏఎఫ్‌సీ



కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసిన అరుణాకర్ బ్రహ్మానందజీ

కాకినాడ సిటీ: విశాఖపట్నం జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ (డీఏఎఫ్‌సీ)గా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా గోనబత్తుల అరుణాకర్ బ్రహ్మానందజీ కాకినాడ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌గా నియమితుల య్యారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వ కంగా కలిశారు.

కిడ్నాప్ చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత



వర్ధినీడి సుజాత

పిఠాపురం: కరపలో మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. రాజస్థాన్ నుంచి వచ్చిన కుటుంబానికి చెందిన బాలికను కిడ్నాప్ చేస్తే పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా పోలీసులు కిడ్నాప్ చేసిన వ్యక్తి పట్టుకుని, బాలికను రక్షించి వారి కుటుంబానికి అప్పగించాలని ఆమె కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఉప కమిషనర్



కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసిన కోన శ్రీనివాస్

కాకినాడ సిటీ: ఏపీ సెక్రటేరియట్ జీఏడీలో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఉప కమిషనర్‌గా నియమితులైన కోన శ్రీనివాస్ మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేశారు.

యువతి అదృశ్యం

కరప: ఉప్పలంక గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, ఉప్పలంక గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతికి వివాహం కుదిరింది. వచ్చే నెలలో నిశ్చితార్థానికి పెద్దలు నిర్ణయించారు. ఈ వివాహం ఇష్టం లేకపోవడంతో ఆమె సోమవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఆమె గురించి ఉప్పలంక, పరిసర గ్రామాల్లోను, బంధువులు, స్నేహితుల గృహాల్లో గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో మంగళవారం రాత్రి కరప పోలీసుస్టేషన్‌లో ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు. ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోండి

కాకినాడ సిటీ: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్ ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు సమస్యల పరిష్కారానికి ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా కోరారు. భూముల విభజనకు ప్రభుత్వ నిర్దేశిత రుసుము రూ.500 నుంచి రూ.50కి తగ్గిందన్నారు. జాయింట్ హక్కుదారులుగా ఉన్న భూములపై వివాదాలు, రిజిస్ట్రేషన్ సమస్యలు, ప్రభుత్వ పథకాల లబ్ధిలో అడ్డంకులు తలెత్తుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనుందన్నారు. జిల్లాలో 273 గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జేసీ తెలిపారు. గతేడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో జరిగిన గ్రామ సభల్లో వచ్చిన అర్జీల్లో కొన్ని ఎల్పీఎంల సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు, జాయింట్ ఎల్పీఎంల విభజనకు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని జేసీ సూచించారు. విభజన తర్వాత ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, తదితర వాటికి అర్హులుగా పరిగణనలోకి వస్తారని తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వ్యాన్

సామర్లకోట: అదుపు తప్పిన వ్యాన్ మంగళవారం స్థానిక ఎఫ్‌సీఐ రోడ్డులోని టైల్స్ షాపు వద్ద రోడ్డు మార్జిన్‌లో విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దాంతో మంటలు చెలరేగడంతో స్థానికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. వివిధ ప్రాంతాల నుంచి బియ్యం లోడ్‌ను ఎఫ్‌సీఐ గోదాములో దింపడానికి వచ్చిన లారీ డ్రైవర్ల సైతం పరుగులు పెట్టారు. స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సత్యనారాయణపురం, మాజేటి నగర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఎఫ్‌సీఐ గోదాములకు సుమారు ఐదు గంటల పాటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో రిజిస్ట్రార్ కార్యాలయంలో కక్షిదారులు ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌కుమార్ తమ సిబ్బందితో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయించి, సరఫరాను పునరుద్ధరించారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా స్తంభాన్ని ఢీకొన్నట్టు స్థానికులు తెలిపారు.

లైసెన్స్ ఉండాల్సిందే..!

- అడ్డదారుల్లో వాహన చోదకుల ప్రయాణాలు
- నగం మందికి డ్రైవింగ్ లైసెన్స్‌లు లేవు
- రెన్యువల్ చేసుకోని వారు వేలల్లోనే..
- నరళతరం చేసినా పట్టించుకోని వైనం



వాహనాలు తనిఖీ చేస్తున్న రవాణా శాఖాధికారులు

బాలాజీచెరువు: నగరంలో అచ్చంపేట జంక్షన్ నుంచి జగన్నాథపురం వరకూ వెళ్లే దాదాపు ఏడు కిలోమీటర్ల ప్రధాన రహదారిలో మూడు లేదా నాలుగు ముఖ్య కూడళ్లో పోలీస్ లేదా రవాణా శాఖాధికారులు చేపట్టే వాహన తనిఖీల్లో సుమారు 60 శాతం లైసెన్స్ లేని కేసులే నమోదవుతున్నాయి. వీరిలో ముఖ్యంగా కళాశాల విద్యార్థులే అధికంగా ఉంటున్నారు. పదో తరగతి పూర్తయిన వెంటనే ఇంటర్మీడియెట్ లేదా పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరడం, వెనువెంటనే కాలేజీకి వెళ్లేందుకు బైక్ కొనివ్వాలంటూ తల్లిదండ్రుల వద్ద గొడవ పెట్టడం ఇటీవల పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలోనే కళాశాలతో పాటు, ఇతర చోట్లకూ స్టూడెంట్లు బైక్‌లపై ప్రయాణించడం కనిపిస్తోంది. ఇదంతా బాగానే ఉన్నా రూ.లక్షలు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేస్తున్నా.. లైసెన్స్ విషయంలో మాత్రం తాత్సారం చేస్తున్నారు. కనీసం సెన్స్ లేకుండా రోడ్లపై తిరుగుతూ కష్టాలు కొని తెచ్చుకుంటున్నారు. జరిమానా వేసినా, హెచ్చరికలు చేస్తున్నా ఏమీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఆన్‌లైన్ పేమెంట్ చెల్లింపుల విషయంలోనూ నిర్లక్ష్యం కనబరుస్తూ.. మమ్మల్ని ఎవరు అడిగేదంటూ రయ్యిన దూసుకెళ్తున్నారు.

తీవ్ర నిర్లక్ష్యం

రవాణా నిబంధనలపై అధికారులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా.. రోడ్డు ప్రమాదాలు జీవితాలను చిదిమేస్తున్నా కొందరు వాహనదారులు మాత్రం మొద్దునిద్ర వదలడం లేదు. కనీసం ప్రాథమికాంశాలను పాటించని పరిస్థితి నెలకొంది. అత్యంత ముఖ్యమైన డ్రైవింగ్ లైసెన్స్‌ను తీసుకోవడంలో కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రవాణా, ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడినా షరామామూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

ద్విచక్ర వాహనాలే అధికం

రవాణా శాఖ పరిధిలో అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహించి లైసెన్స్ లేనివారికి సుమారు రూ.5 వేల జరిమానా విధిస్తున్నారు. అయినా కొందరిలో ఏమాత్రం మార్పు కానరావడం లేదు. కాకినాడ నగర ఆర్‌టీఓ పరిధిలో దాదాపు 1.37 లక్షల ద్విచక్ర వాహనాలు ఉండగా, కేవలం లైసెన్స్‌లు మాత్రం 50 వేలకు దాటి ఉండక పోవడం గమనార్హం.

జరిమానాలకూ స్పందించరు

వాహనదారుల్లో మార్పు తీసుకురావడానికి ఇటు పోలీసులు, అటు రవాణా శాఖ అధికారులు ఎల్‌ఎల్‌ఆర్ క్యాంపులు, రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహిస్తూనే ఉన్నారు. నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధిస్తున్నా, 60 శాతం మంది ఫైన్ కట్టడం లేదు. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న వారిలో లైసెన్స్ లేనివారే అధికంగా ఉన్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అవగతమవుతుంది.

కాకినాడ ఆర్‌టీఏ పరిధిలో..

ద్విచక్ర వాహనాలు	1,36,7249
కార్లు	1,04,201

లైసెన్స్ వివరాలు

లైట్ మోటర్ వెహికల్	6,25,134
మోటార్ సైకిల్ విత్ గేర్	9,16,670
విత్ అవుట్ గేర్	20,583

రెన్యువల్ చేసుకోనివారు 25 వేలు (దాదాపుగా)

లైసెన్స్ తప్పనిసరి



డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపడం అత్యంత ప్రమాదకరం. నేరం కూడా. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ వాహనం నడిపేవారు లైసెన్స్ పొందాలి. నేటి కాలంలో ప్రతి ఇంటికి రెండు నుంచి మూడు బైకులు ఉంటున్నాయి. పోలీసుల సహకారంతో రవాణా శాఖ ఆర్‌టీఏ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తోంది. అలాగే ప్రభుత్వం లైసెన్స్‌ల జారీ ప్రక్రియ సరళతరం చేసింది. ముఖ్యంగా చాలా మంది లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవడం లేదు.

– కె.శ్రీధర్, జిల్లా రవాణాశాఖాధికారి

పాత వస్తువులూ అక్కరకొస్తాయి



ఇంట్లో పెంచిన మొక్కలు చూపుతున్న సభ్యులు

బోట్‌క్లబ్: ఇంట్లో వాడివేసిన వస్తువులను పారేయకుండా.. సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అద్దాల సత్యనారాయణ అన్నారు. స్థానిక అయోధ్యనగర్‌లోని రాధాకృష్ణ బృందావనంలో మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో అప్ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఇళ్లల్లో ఉపయోగించిన పాత వస్తువులను పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా ఎలా వినియోగించవచ్చో రాధ అనే మహిళ ఇంట్లో వాడిన సీసాలు, టైర్లు, బూట్లు, డబ్బాల్లో పెంచిన మొక్కల కళాకృతులను చూపించారు. పర్యావరణ పరిరక్షణ అప్‌సైక్లింగ్‌లో రాధ సమాజంలో మార్గదర్శకురాలన్నారు. అప్‌సైక్లింగ్ డే అనేది పాత వస్తువులను ఉపయోగించి పర్యావరణ పరిరక్షణకు అనుకూలమైనదిగా చేస్తారని, ఇది వస్తువులను రీసైకిల్ చేయడానికి, వ్యర్థాలను తగ్గించడానికి సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సాయికార్తీక్, లిఖిత, శ్రీవల్లి, చైతన్య, సిరాజ్ పాల్గొన్నారు.

మెరిసిన సర్కారీ స్కూళ్ల విద్యార్థులు

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



కనకం సంధ్య, కంచర్ల యశశ్విని విజయదుర్గ, దేవిశెట్టి రమ్యశ్రీ సత్య రత్నమణి, నున్న తేజ దుర్గాభవాని, జీలకర్ర నాగ సాయి ఆదిత్య, ముమ్మిడివరపు మహాలక్ష్మి, పేరెళ్ల సుధీర్‌కుమార్, ఎస్.రేఖాధనశ్రీ, గండి రామలక్ష్మి, యర్రంనీడి సరస్వతీదేవి, తలారి వీరలావణ్య, వి.హర్షిత, రూపాదేవి, వేణుక, మనోజ్ఞ, వర్షిణి, పి.పావనాంజలి, వెంటూరి బేబీ స్వరూప

కాకినాడ రూరల్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన కాకినాడ రూరల్ మండలంలోని విద్యా కుసుమాలు ట్రిపుల్ ఐటీలకు ఎంపికై సత్తా చాటారు, మండలంలోని ఏడుగురు విద్యార్థినులు ఒంగోలు, శ్రీకాకుళం, నూజివీడు ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు. వీరిలో పండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి అత్యధికంగా నలుగురు, నేమాం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు, ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఒకరు ఉన్నారు. పండూరు హైస్కూల్ నుంచి రూపాదేవి, వేణుక, మనోజ్ఞ, వర్షిణి ఎంపికయ్యారు. నేమాం హైస్కూల్‌కు చెందిన పి.పావనాంజలి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకు, వి.హర్షిత ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. రమణయ్యపేట ఏపీఎస్పీ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని వెంటూరి బేబీ స్వరూప నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. విద్యార్థినులను ఎంఈఓ వేణుగోపాల్, హెచ్‌ఎంలు సూర్య ప్రకాశణి, నాగేశ్వరరావు, గాయత్రి అభినందించారు.

11 మంది ఎంపిక

కరప: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల్లో ప్రవేశానికి కరప మండలం నుంచి 11 మంది విద్యార్థులు ఎంపికైనట్టు ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు తొలి దఫా కౌన్సెలింగ్‌క ఎంపికయ్యారన్నారు. కరపలోని నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు కనకం సంధ్య, కంచర్ల యశ్విని విజయదుర్గ, దేవిశెట్టి రమ్యశ్రీ సత్యరత్నమణి, నున్న తేజదుర్గాభవాని, వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి జీలకర్ర నాగసాయి ఆదిత్య, ముమ్మిడివరపు మహాలక్ష్మి, పేరెళ్ల సుధీర్ కుమార్, పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ(ఫకీర్రావు) హైస్కూలు నుంచి ఎస్.రేఖాధనశ్రీ, గొర్రిపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి గండి రామలక్ష్మి, యర్రంనీడి సరస్వతీదేవి, తలారి వీరలావణ్య ఎంపికయ్యారన్నారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రాజరాజేశ్వరి, త్రిమూర్తులు, ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్, వీఎస్‌వీ రమణమూర్తి తదితరులు అభినందించారు.

రోడ్డు సరే.. బెర్మ్ ఏదీ..?



రమణయ్యపేటలోని ఏపీఐఐసీ కాలనీలో బెర్మ్ లేని సీసీ రోడ్డు

కాకినాడ రూరల్: మండలంలోని పలు గ్రామాలలో సిమెంట్ రోడ్లను ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించారు. రోడ్ల నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా.. సైడ్ బెర్మ్‌లు మాత్రం పూర్తి చేయలేదు. రోడ్డును ఆనుకుని గ్రావెల్‌తో బెర్మ్‌లు నిర్మాణం చేపట్టడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదు. రోడ్డు కూడా చాలా కాలం పటిష్ఠంగా ఉంటుంది. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీతో పాటు పలు ప్రాంతాలలో నిర్మించిన రోడ్లకు బెర్మ్‌లు లేక, బైక్‌లు, సైకిళ్లపై రాకపోకలు సాగించేవారు అదుపుతప్పి పడిపోతున్నారు. తక్షణమే సైడ్ బెర్మ్‌లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

అది ప్రభుత్వ స్థలమే..

తహసీల్దార్ చిన్నారావు



ప్రకాశ్ నగర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

కొత్తపల్లి: ప్రకాశ్ నగర్‌లో ఉన్న స్థలం ఏ వర్గానికి చెందినది కాదని, అది ప్రభుత్వ స్థలమని తహసీల్దార్ చిన్నారావు స్పష్టం చేశారు. మండలంలోని మూలపేటలోని ప్రకాశ్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంపై కొన్ని రోజులుగా రజకులు, పట్టుశాలీ వర్గాల మధ్య వివాదం నెలకొంది. దీనిపై ఆయా వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆ స్థలాన్ని తహసీల్దార్ పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకాశ నగర్‌లో ఉన్న 25 సెంట్లు గతంలో సామాజిక స్థలంగా కేటాయించినట్టు చెప్పారు. ఈ స్థలం ఏ కులానికి కేటాయించలేదన్నారు. ఈ స్థలంలో ఏ కులానికి చెందిన వారు వెళ్లరాదని స్పష్టం చేశారు. పంచాయతీ నిర్ణయం మేరకు ఈ స్థలం ఉంటుందన్నారు.

మార్కెట్ సదుపాయాలు మెరుగుపర్చాలి



సర్పంచ్‌లకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీలు

సామర్లకోట: ప్రతి గ్రామంలోను మార్కెట్ సదుపాయాలను సర్పంచ్‌లు మెరుగు పర్చాలని ఫ్యాకల్టీ చక్రపాణిరావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని సర్పంచ్‌లకు రెండో రోజు శిక్షణలో ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో రైతులు పండించిన పంటలను స్థానికంగా ఉండే వారికి అందే విధంగా మార్కెట్ సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రామంలోను మహిళా సంఘాలు ఉంటాయని, వారు తయారు చేసిన వస్తువులను మార్కెట్లలో విక్రయించే అవకాశం ఉంటుందన్నారు. నాణ్యత కలిగిన వస్తువులు స్థానికంగానే లభించడంతో మార్కెట్‌లకు డిమాండ్ ఉంటుందన్నారు. గ్రామాల్లో నాణ్యత కలిగిన వస్తువులు విక్రయించడంతో పట్టణ ప్రాంతాలకు చెందని వారు కూడా సమీప గ్రామాలకు వచ్చి వస్తువులు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. కోర్సు డైరెక్టర్ కె.సునీల మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాలలోను సమానత్వం కలిగి ఉండాలని సూచించారు. సర్పంచ్‌లుగా సొంత నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సర్పంచ్‌గా ఉత్తమ సేవలు అందిస్తే ప్రజల్లో గుర్తింపు ఉంటుందన్నారు. గ్రామాలకు వచ్చే నిధులపై అవగాహన కలిగి ఉండి, వాటిని ప్రజోపయోగ పనులకు వినియోగించాలన్నారు. ప్రిన్సిపాల్ కేవీఎస్‌వీ ప్రసాదరావు, వైస్ ప్రిన్సిపాల్ రమణ శిక్షణ తీరును పరిశీలించారు. ఫ్యాకల్టీలు కేఆర్ నిహారిక, జగన్నాథం శిక్షణ నిర్వహించారు.

ఒలింపిక్ డే రన్



కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాల వద్ద నిర్వహిస్తున్న ఒలింపిక్ డే రన్

కొత్తపల్లి: అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా మండలంలోని ఉప్పాడలో మంగళవారం జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-2 పైడిరాజు, కొత్తపల్లి జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌లు సీకోటి బుజ్జి, వనమాడి తాతాబ్బాయి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్నపూర్ణ, శాస్త్రి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై దృష్టి సారించాలి

కాకినాడ సిటీ: స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్‌కు సంబంధించి శాఖల వారీగా జిల్లా కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పొల్యూ కంట్రోల్ బోర్డు, వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్, వికలాంగులు వయోవృద్ధుల శాఖల జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, టీం సభ్యులు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రణాళికను అమలు చేయాలన్నారు. నియోజకవర్గ, మండల స్థాయిలో పరిస్థితులు, వనరులను పూర్తిగా అధ్యయనం చేసి, వచ్చే ఏడాది ఏ సెక్టార్లో అభివృద్ధి, వృద్ధి రేటు ఎలా ఉంటుందో అనే అంశంపై యాక్షన్‌ప్లాన్ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో జె.నరసింహ నాయక్, పాడా పీడీ చైత్రవర్షిని, సీపీవో పి.త్రినాథ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ, డీసీహెచ్‌ఎస్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్, ఐడీసీడీఎస్ పీడీ, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ తదితర అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల సంక్షేమానికి చేయూత



యంగ్ ఇండియన్స్ ట్రస్ట్ ప్రతినిధులకు చెక్కు ఇస్తున్న కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

బోట్‌క్లబ్: ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు యంగ్ ఇండియన్స్ ట్రస్ట్ సంస్థ ఏటా దాతల సహకారంతో పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేయడంతో పాటు, ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందజేస్తుంది. పార్టీలు, ప్రాంతాలకతీతంగా ఏడాదిగా ప్రతిభ కలిగిన విద్యార్థులను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌ను ఇటీవల ట్రస్ట్ ప్రతినిధులు కలిశారు. తమ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను వివరించి, పేద విద్యార్థులకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఎంపీ మంగళవారం ట్రస్ట్ ప్రతినిధులకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఐదేళ్లుగా సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకుని, భవిష్యత్తులో తన సహకారం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నాగమూడి సత్యనారాయణ, బాదం ఆనంద్‌కుమార్, రాగాల ఉమామహేశ్వరరావు, కోన వెంకట్ పాల్గొన్నారు.

సంస్కృతికి భాషే ఆధారం

మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కమిషనర్, హెచ్‌ఎం

సామర్లకోట: భాష ఆధారంగానే సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. కొత్త భాష నేర్చుకుందాం అనే కార్యక్రమం ముగింపు సందర్భంగా మంగళవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ భాషల్లో ఉండే మాధుర్యం గ్రహిస్తే ఆయా ప్రాంతాల సంస్కృతిపై అవగాహన కలుగుతుందన్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా తమిళ భాషపై ఈ నెల 16 పాఠశాలలో శిక్షణ ప్రారంభించారు. తమిళ భాషలో శిక్షణ పొందిన విద్యార్థులను కమిషనర్ అభినందించారు. ఒకే భాష కాకుండా వివిధ భాషలు నేర్చుకోవడం ద్వారా ఉపాధి అవకాశం మెరుగ్గా ఉంటుందన్నారు. పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ మాట్లాడుతూ, తమిళ భాష విద్యార్థులకు నేర్పడానికి తమ పాఠశాలను ఎంపిక చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. నవోదయ స్కూల్ హిందీ టీచరు, రిసోర్స్‌పర్సన్ ఎం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, తమిళ భాషలో ఉండే సౌందర్యాన్ని, సౌలభ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్‌ను కమిషనర్ శ్రీవిద్య సత్కరించారు. తమిళ భాష నేర్చుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీ పి.సుధారాణి, ఉపాధ్యాయులు ఎన్ హరినాథ్, బాల శైలజ, టి.పద్మావతి, లక్ష్మీదుర్గా, బేబీరాణి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా మరిడమ్మ జాతర ఆరంభం



ప్రత్యేకాలంకరణలో మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా ఉభయ రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆషాఢ మాసంలో 37 రోజుల పాటు నిర్వహించే అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా గరగల నృత్యం, అమ్మవారి రథం, బ్యాండ్ మేళాలు, కోలాటం మధ్య అమ్మవారి సంబరం అంబరాన్నంటింది. జాతర మహోత్సవాన్ని రాత్రి 8 గంటలకు దేవదాయ శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ ప్రారంభించారు. వారికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, ఆలయ ట్రస్టీ చింతపల్లి శ్రీహర్ష, వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ఘన స్వాగతం పలికారు. దేవదాయ శాఖాధికారులు అమ్మవారిని దర్శించుకుని కొబ్బరికాయ కొట్టి జాతరను ప్రారంభించారు. ఉత్సవంలో భాగంగా అమ్మవారి గరగల నృత్యం, కోలాటం, పులి ఆట, సంబరాల్లోని పలు సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు తిలకించారు. తొలుత పాత పెద్దాపురం (కోట ముందు) పురాతన చరిత్ర కలిగి మరిడమ్మ అమ్మవారు వేలసిన ఆలయంలో గరగను ఎత్తుకుని సంబరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పదివేల లీటర్ల డీజిల్ స్వాధీనం

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి డీజిల్‌ను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు, యానాం నుంచి ఆయిల్ ట్యాంకర్‌లో పది వేల లీటర్ల డీజిల్‌ను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. దీనికి సంబంధించి అనకాపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్టు ఆయన తెలిపారు. ఆయిల్ ట్యాంకర్‌ను సీజ్ చేసి, పది వేల లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. యానాం నుంచి పెట్రోల్, డీజిల్‌ను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడిలో కోరంగి పోలీసు స్టేషన్ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.